# ప్రస్తుత పరిస్థితులలో
# భారత కార్మికవర్గం ముందున్న కీలక కర్తవ్యం

**మన** దేశంలో బ్రిటిష్ వలస పాలన అంతమై 72 సంవత్సరాలు కావస్తున్నా దేశ ప్రజల, ప్రత్యేకించి శ్రామిక ప్రజానీకం యొక్క స్థితిగతులు ఏమాత్రం మెరుగుపడలేదు; అందుకుబదులుగా నానాటికీ క్షీణిస్తూ వున్నాయి. దేశంలో దారిద్ర్యం అనూహ్యమైన స్థాయికి పెరిగిపోయింది. నిరుద్యోగం గత 46 సంవత్సరాల స్థాయిని మించి పెరిగిపోయింది. సామాజిక అసమానతలు తీవ్రమయ్యాయి. దేశమంతటా కుల, మత విద్వేషాలపై ఆధారపడ్డ హింస చెలరేగుతోంది. స్త్రీలపై లైంగిక హింస దారుణ రూపం దాల్చింది. తమ సమంజసమైన హక్కుల కోసం గళం విప్పే అన్ని సెక్షన్ల ప్రజలపై – మేధావులపై సైతం – అణచివేత సాగుతోంది. ప్రజల, కార్మికుల హక్కులను హరిస్తున్నారు; ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛా – స్వాతంత్రాలపై ఆంక్షలు విధిస్తున్నారు. నిరంకుశాధికార పాలన దిశలో పాలకులు వేగంగా చర్యలు తీసుకొంటున్నారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులను చట్టబద్ధంగానే రద్దు చేస్తున్నారు. పలురకాల క్రూర నిర్బంధ చట్టాలు చేస్తున్నారు. దేశ ప్రజల కనీసపు ఆకాంక్షలను కూడా సహించమంటున్నారు.

దేశంలో సంపదను సృష్టించి, పెంపొందించే కార్మికవర్గాన్ని నామమాత్రంగా కూడా లక్ష్యపెట్టడానికి పాలకులు – పాలకవర్గాలు నిరాకరిస్తున్నారు. శతాబ్ద కాలంగా వీరోచిత పోరాటాలు సాగించి, తమ ఆత్మ బలిదానాల ద్వారా, అశేష త్యాగాల ద్వారా కార్మికవర్గం సాధించుకున్న హక్కులనన్నింటినీ నిర్దాక్షిణ్యంగా రద్దుచేస్తున్నారు. కార్మికవర్గాన్ని – కార్మికవర్గం యొక్క శ్రమశక్తిని బడా పెట్టుబడిదారీవర్గం, సామ్రాజ్యవాదులు నిరాటంకంగా దోచుకొనేందుకు పూర్తి హక్కులను, పరిస్థితులను కల్పిస్తున్నారు.

దేశానికి వెన్నెముకగా వున్న రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని తీవ్రమయిన సంక్షోభంలోకి నెట్టి, వారిని అనాధలుగా మార్చారు. సామ్రాజ్యవాద, మార్కెట్టుశక్తుల పెత్తనాన్ని, ఆధిపత్యాన్నీ వ్యవసాయ రంగంపై బలవంతంగా రుద్దారు. పేద, చిన్న, మధ్యతరగతి రైతాంగాన్ని సంక్షోభ భారం తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే స్థితి కల్పించారు. నిరుపేదలుగా మారిపోయిన రైతాంగం, ఉపాధిని వెతుక్కొంటూ సుదూర ప్రాంతాలకు కుటుంబాలు – కుటుంబాలుగా వలసలబాట పట్టాల్సిన తప్పనిసరి పరిస్థితులు సృష్టించారు. దిక్కూ, మొక్కూ లేని ప్రమాద భరితమైన, కష్టసాధ్యమైన శారీరక శ్రమచేసే నైపుణ్యంలేని రోజువారీ కూలీలుగా పనిచేయవల్సిన స్థితికి వీరిని నెట్టారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయిక రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వివిధ వృత్తుల ప్రజల బతుకులను, వ్యవసాయం ఆధారపడిన కూలీల జీవనోపాధిని ధ్వంసం చేశారు.

తమ సహజ నివాసమైన అడవులలో, కొండలలో నివసిస్తూ తమదైన సంస్కృతి – సాంప్రదాయాలను పాటించే ఆదివాసులను వారి భూముల నుండి, ఆవాసాల నుండీ బలవంతంగానూ, చట్టపరంగానూ వెళ్ళగొడ్తూ వారిని నిరాశ్రయులను చేస్తున్నారు.

పట్టణ ప్రాంతాలలో విద్యాధికులు సహితం నిరుద్యోగులుగా మిగిలిపోతూ, అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్న, ప్రమాదకర వ్యసనాలకు లోనవుతున్న దిగజారుడు పరిణామాన్ని, పాలకులు – పాలకవర్గాలూ సృష్టించారు.

దళితులూ, మహిళలూ, మత మైనారిటీలూ... ఒక్కమాటలో చెప్పాలంటే దేశంలోని అన్ని సెక్షన్ల ప్రజల జీవన స్థితిగతులూ ఘోరమైన స్థాయికి పతనమయ్యాయి.

మరోవైపు తమ దిగజారిన జీవనస్థితిగతులను మెరుగుపరుచు కోవటానికి, హక్కుల సాధనకోసం, ప్రజాస్వామిక ఆకాంక్షల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు వివిధ స్థాయిలలో, వివిధ రూపాలలో పోరాడుతున్నారు. వారిని ఐక్యం కాకుండా నిరోధించే కుల, మత, ప్రాంతీయ, జాతీయ, భాషా ఉన్మాదాన్ని – వైషమ్యాలను రెచ్చగొట్టే విష భావజాలాన్ని పాలకులు, పాలకవర్గాలు ప్రజల మనస్సులోకి దట్టిస్తున్నారు. ప్రచార, ప్రసార సాధనాలకు తమ గుప్పెట్లో పెట్టుకొని కాలం చెల్లిన అంధ విశ్వాసాలను, పతన సంస్కృతిని విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారు.

దేశంలో నెలకొన్న ఈ పరిస్థితికి కారణం నాడు జాతీయ విముక్తి కోసం – ప్రజల ప్రజాతంత్ర విప్లవం కోసం కార్మికవర్గం చేపట్టిన కర్తవ్యాలు పరిపూర్తి కాకుండా మిగిలిపోవటమే.

అందువల్లనే దేశంలో సామ్రాజ్యవాద దోపిడీ నేడు అనూహ్యమైన స్థాయిలో సాగిపోతోంది. భూస్వామ్యవర్గం (ఫ్యూడల్‌వర్గం) యొక్క దోపిడీ, పీడనలు రూపాలు మారినా నేటికీ యధాప్రకారంగా కొనసాగుతూనే వున్నాయి. భూస్వామ్యవర్గాన్ని సాంఘిక పునాదిగా జేసుకుని, సామ్రాజ్యవాదం, దళారీ పెట్టుబడిదారీవర్గం ద్వారా తన దోపిడీని నానాటికీ తీవ్ర జేస్తోంది. మనదేశంలో నేడున్న ఈ అర్ధవలస – అర్ధభూస్వామ్య దోపిడీ వ్యవస్థను రద్దుచేసి, ప్రజల ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పాల్సిన కర్తవ్యం పరిపూర్తికానంతవరకూ, నానాటికి ముమ్మరమవుతున్న దోపిడీ, సామాజిక అసమానతలు, దుర్భర దారిద్ర్యం, నిరుద్యోగం తదితర వినాశకర రుగ్మతలను అంతం చేయటం అసాధ్యం.

నేడు అటువంటి ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాన్ని చేపట్టాల్సిన చారిత్రక బాధ్యతతోపాటు ఈ ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత కూడా కార్మికవర్గానిదే. ఈ ప్రజాతంత్ర విప్లవాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయాలంటే కార్మికవర్గం

బడా పెట్టుబడి దోపిడీకి, పెట్టుబడిదారీ – సామ్రాజ్యవాద దోపిడీకి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగంతో భుజం, భుజం కలిపి పోరాడాలి. రైతాంగం ప్రధాన శక్తిగా సాగే ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించి ముందుకు నడపాలి. ఇతర రంగాల ప్రజలు సాగించే ప్రజాతంత్ర హక్కుల పోరాటాలకు కార్మికవర్గం సంఘీభావంగా నిలవాలి. మహిళా, విద్యార్థి, గిరిజన, ఉద్యోగ, బలహీనవర్గాల వారితో భుజం, భుజం కలిపి పోరాడి, ఆ పోరాటాలను ప్రజాతంత్ర – విప్లవ పోరాటంలో ఒక భాగంగా మలచాలి. విశాల కార్మికవర్గాన్ని ట్రేడ్ యూనియన్లలో సంఘటితపరచటంలోపాటుగా వ్యవస్థ మార్పుకు కార్మికవర్గం నాయకత్వం వహించాలనే రాజకీయ కృషిని వారి మధ్య నిరంతరం సాగించాలి. వారిని అందుకు సన్నద్ధం చేయాలి.

కార్మికవర్గం యొక్క అంతిమ లక్ష్యం వర్గరహిత – సోషలిస్టు వ్యవస్థ ఏర్పాటేనన్నది నిర్వివాదం. అయితే ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే, మనదేశ నిర్దిష్ట పరిస్థితులలో ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయాలి. అదే ప్రస్తుత విప్లవ దశ. ఈ దశను పూర్తిచేయకుండా, వర్గరహిత సమాజ వ్యవస్థను ఏర్పాటుచేసే లక్ష్యాన్ని చేరుకోవటానికి మరేదగ్గర మార్గం లేదు. యీ సుదీర్ఘ విప్లవాన్ని సాగించి విజయవంతం చేయటమన్నదే భారత కార్మికవర్గపు తక్షణ, ఆవశ్యక కర్తవ్యం!

అయితే దేశంలోని కార్మికోద్యమం వివిధ చారిత్రక కారణాల దృష్ట్యా అనేక బలహీనతల వాత బడింది. కార్మికులను ఐక్యపరచి, సంఘటితపరచి, చైతన్యపరచి ఒక వర్గశక్తిగా మలచే కర్తవ్యాన్ని ప్రతిభావంతంగా నిర్వర్తించగలిగిన స్థితిలో లేదు. సంస్కరణవాదం, ఆర్థికవాదం, చట్టబద్ధవాదం, జాతీయ దురహంకారవాదం, కుల – మత – ప్రాంతీయ విద్వేష భావజాలాల ఊబిలోకి కూరుకుపోయింది. దోపిడీ పాలకవర్గాల జిత్తులు, కుట్రల ఉచ్చులో చిక్కుకు పోయింది.

దేశంలోని యావత్ కార్మికులను ఐక్యపరచి, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సంఘటితపరచి, వారిని ఒక వర్గశక్తిగా – కార్మికవర్గంగా – అగ్రగామి శ్రేణులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత, కర్తవ్యం భారత కార్మికోద్యమంపైనున్నాయి.

అందుకుగాను భారత కార్మికోద్యమం – పైన పేర్కొన్న ఆ బలహీనతల నుండి తనకు తాను బయటపడాల్సి వుంది. దేశమంతటా వున్న కార్మికులను ఆ హానికర భావజాల ప్రభావాల నుండి బయటకు తీసుకువచ్చి వారిని వర్గ రాజకీయ చైతన్యవంతులుగా ఐక్యపరచాల్సి వుంది. అలా ఐక్యమైన కార్మికులను ఒక వర్గశక్తిగా మలచి సంఘటితపరచాల్సి వుంది. ఆ రకంగా ఒక వర్గశక్తిగా మలచబడ్డ భారత కార్మికవర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించే స్థితికి వస్తుంది. ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను చేబడుతుంది. ప్రజాతంత్ర విప్లవానికి, రైతాంగపు మద్దతును సాధించి, నాయకత్వం వహిస్తుంది. ఆరకంగా ప్రస్తుత దశలో తన విప్లవ కర్తవ్యమైన ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహిస్తుంది. తన అంతిమ లక్ష్యమైన వర్గరహిత సమాజ స్థాపన లక్ష్యంవైపుకు పురోగమించగలుగుతుంది.

కార్మికవర్గం యీ కర్తవ్య నిర్వహణ ద్వారా యావత్ భారత ప్రజానీకంపై సాగుతున్న దోపిడీ, అణచివేతల పాలనా వ్యవస్థను అంతం చేయగలుగుతుంది. కార్మికవర్గ విజయం తథ్యం!

ooo